మలాన్ని ఎత్తి గంపల్లో మోసుకొంటూ వెళ్లే అమానుషమైన పనిలో మగ్గుతున్నారు'.. అలా తన పీజీ థీసిస్ గురించి క్లుప్తంగా చెప్పాడు హాసన్.

అంతలో ఇంటర్వ్యూలో తనను ప్రశ్నించే వ్యక్తి..

''మీకు ఈ హాసన్ అనే పేరు ఎలా వచ్చింది?'' అని అడిగాడు హఠాత్తుగా..

''యేసుక్రీస్తు పుట్టినప్పుడు ఆయన్ని పడుకోబెట్టేందుకు ఏ స్థలమూ లేదు. మరియమ్మ ఆయనను పశువుల పాకలో, పశువుల తొట్టెలో పడుకోబెట్టింది. అలాగే ఆయన పుట్టినరోజు డిసెంబర్ 25నే పుట్టిన నన్ను.. ఒక ఖబ్రస్థాన్‌లో పడుకోబెట్టారు'' అన్నాడు హాసన్.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో విశిష్ట బహుమతి పొందిన కథ.

ఆ మాటలకు ఇంటర్వ్యూ బోర్డులోని సభ్యులు ఆశ్చర్యంగా చూశారు. మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు.

''మా నాన్నకు ఆ సమయంలోనే, మా అమ్మ డెలివరీ అవడానికి రెండు నెలల ముందు ఢిల్లీలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా మినిస్ట్రీలో గుమస్తా ఉద్యోగం వచ్చింది. నిండు చూలాలైన మా అమ్మను తీసుకొని ఆయన ఢిల్లీ వచ్చేశారు. కొన్నిరోజులు హోటల్లో ఉన్నారు. ఇళ్ల కోసం వేట మొదలుపెట్టారు. అయితే ఆయనకు ఇల్లు ఇవ్వడానికి ఎవరూ ఒప్పుకోలేదు''.

ఆ కమిటీలో ఆ ప్రశ్న అడిగిన సభ్యుడు..

''ఎందుకు ఇల్లు ఇవ్వలేదు?'' అని మళ్లీ అడిగాడు.

''రాజ్యాంగంలోని షెడ్యూల్ కులాల జాబితాలో మాది 51వ కులం. పాకి, తోటి, మోటి. ఈ జాబితాలో మొదటిది. అలా ఇళ్ల కోసం తిరిగిన మా నాన్న విసిగి వేసారుతున్న సమయంలో.. పాత ఢిల్లీలోని ఖబ్రస్థాన్ ప్రాంతంలో ఓ ఇల్లు దొరికింది''.

''అంటే.. యు మీన్ బరియల్ గ్రౌండ్'' అన్నాడు ఇంకో సభ్యుడు.

''అవును సార్. ఢిల్లీలోని ఆ ఖబ్రస్థాన్ ప్రాంతంలో 500 ఏళ్ల క్రితం నుంచి ఉన్న గోరీలు ఉన్నాయి. వందలాది సమాధుల మధ్య ఇల్లు నిర్మించుకున్నారు. వాటిని పగలగొట్టడం ఇష్టంలేక అలా ఉంచేసి ఇల్లు కట్టుకొన్నారు. అంచేత కొన్ని ఇళ్లల్లో కూడా సమాధులు కనిపిస్తాయి. అలా మాకు ఇచ్చిన ఆ అద్దె ఇంట్లో మా బెడ్ రూమ్‌లోనూ ఒక సమాధి ఉంది. అక్కడే నా జననం. అలా జీసస్ క్రైస్ట్ పుట్టుక పశువుల పాకలో జరిగితే, నా పుట్టుక సమాధుల స్థలంలో జరిగింది. ఎవరూ ఇల్లు ఇవ్వడానికి నిరాకరించగా.. పెద్ద మనసుతో ఇల్లు ఇచ్చిన ఆయన పేరే మా నాన్న నాకు పెట్టాడు. అదే 'హాసన్' పేరు వెనక కథ. పాతికేళ్లుగా మేము ఆ ఇంట్లోనే మకాం. జీవం ఉన్న మనుషులు.. జీవం లేని మనుషులతో సహవాసం'' అంటూ చెప్పడం ముగించాడు.

''మీ పీహెచ్‌డీ థీసిస్‌లో సబ్జెక్ట్ ఏంటి?'' అని అడిగాడు కమిటీ చైర్మన్.

''బ్యాట్.. అంటే గబ్బిలాలు'' అన్నాడు హాసన్.

''పులులు, సింహాలు, ఏనుగులు.. ఇలా ఆకర్షణీయమైన జంతువుల గురించి పరిశోధనలు చేస్తారు. మరి గబ్బిలాల గురించి ఎందుకు అధ్యయనం చేశారు?'' అన్నాడు చైర్మన్.

హాసన్ చెప్పడం మొదలుపెట్టాడు.

''నా రీసెర్చ్ టాపిక్.. కన్జర్వేషన్, ప్రయారిటైజేషన్ ఆఫ్ సౌత్ ఆసియా బ్యాట్స్. మనం గబ్బిలాలను అసహ్యించుకుంటాం. ఇంటి పరిసరాల్లో కనిపిస్తే వాటిని పారదోలుతాం. సినిమాల్లో వాటిని రక్తం తాగే డ్రాకులాలుగా చిత్రీకరిస్తారు. అయితే ప్రపంచం మొత్తానికి 1460 గబ్బిల ప్రజాతులు ఉంటే.. వాటిలో మూడు రకాలు మాత్రమే రక్తాన్ని ఆహారంగా తీసుకుంటాయి. ఈ మూడు దక్షిణ అమెరికా, అమెజాన్ అడవుల్లో మాత్రమే ఉన్నాయి. ఇవి మినహా మిగతావన్నీ పళ్లూ, కీటకాలు తినేవే! పంట పొలాలను నాశనం చేసే పురుగులను గబ్బిలాలు తిని పంటలకు మేలు చేస్తాయి. గబ్బిలాల సంఖ్య పెరిగితే పంటలకు పురుగు మందుల వాడకం తగ్గుతుంది. అయితే చీడపీడ నివారణకు వాడే పురుగు మందుల్లో రసాయనాల వల్ల ఆ పురుగులను ఆహారంగా తిని గబ్బిలాలు చనిపోతున్నాయి.

70 శాతం గబ్బిలాల జాతులకు కీటకాలు, దోమలే ఆహారం. ఒక్క రాత్రిలోనే కోట్ల సంఖ్యలో కీటకాలను నియంత్రించి రైతులకు మేలు చేస్తాయి. మకరందాన్ని ఆహారంగా స్వీకరించే కొన్ని జాతుల గబ్బిలాలు మొక్కల ఫలదీకరణానికీ దోహదపడతాయి. అయితే క్రమంగా కొన్ని గబ్బిలాల జాతుల మనుగడ ప్రమాదంలో పడింది. విద్యుత్ తీగలతోనూ ప్రాణాలు కోల్పోతున్నాయి. గాలిమరల వల్ల చనిపోతున్నాయి. అందుచేత గబ్బిలాలు అనేవి శత్రువులు కాదు. మనిషికి మిత్రులే! ఇదే నా థీసిస్‌లో చెప్పింది'' అంటూ ముగించాడు.

''అయితే గబ్బిలం మీద ఒక కవి కావ్యం రాశాడు కదా!'' అన్నాడు ఒక సభ్యుడు.

''అవును సార్! గబ్బిలాన్ని అపశకున పక్షిగా సమాజం పరిగణిస్తుంది. ఎందుకంటే అది వెలుగును చూడలేదు. పంచముల జీవితాల్లో వెలుగు లేదు. ఎంత ఎదిగినా ఇంకా సమాజం దూరంగానే పెడుతున్నది. దాని ప్రతీకగా జాషువా మహాకావ్యం గబ్బిలాన్ని రాశాడు'' చెప్పడం ముగించాడు.

''ఇంకా మీ హాబీలు?'' అడిగాడు కమిటీ సభ్యుడు.

''నేను ఇంగ్లిష్ నవలలు బాగా చదువుతాను''.

''మీకు బాగా నచ్చిన నవల?''.

''ముల్క్‌రాజ్ ఆనంద్ రాసిన అన్‌టచబుల్!''.

వెంటనే ఇంకో సభ్యుడు ప్రశ్నించాడు..

''మీరు ఐఏఎస్, ఐపీఎస్‌లలో ఏ సర్వీస్‌ను ఎంచుకోవడానికి ఇష్టపడుతున్నారు?''.

ఒక్క క్షణం ఆలోచించి చెప్పాడు..

''ఇండియన్ ఫారెన్ సర్వీస్. నేను ఇందాక చెప్పినట్టు ముల్క్‌రాజ్ ఆనంద్ రాసిన ఆ నవల నాకు స్ఫూర్తిగా నిలిచింది. దాంట్లో బాఖా అనే పద్దెనిమిదేళ్ల కుర్రవాడు మరుగుదొడ్లు శుభ్రపరుస్తాడు. ఇంగ్లిష్ వారిలా దుస్తులు ధరించాలని, హాకీ ఆడాలని అతని కోరికలు. అయితే అతని కోరికలు తీరే మార్గం ఉండదు. బాఖా లాంటి నిమ్నజాతి యువకుడి కల నా ద్వారా తీర్చుకోబోతున్నాను'' అని చెప్పాడు.

''ఇంటర్వ్యూ అయిపోయింది. మీరు వెళ్లవచ్చు'' చెప్పాడు ఇంటర్వ్యూ చైర్మన్. ఆ ఇంటర్వ్యూ విషయం అంతా మనసులో మెదిలింది హాసన్‌కు.

ఇహంలోకి వచ్చాడు.

* * *

తరువాత రోజు ఎప్పటిలాగే వాష్‌రూమ్ కడగడానికి వచ్చిన కేల్విన్‌ను వారించి తనే వాష్‌రూమ్ కడుక్కున్నాడు. అప్పటికి హాసన్‌తో చనువు పెరిగిన కేల్విన్..

''ఎందుకు సార్.. వాష్ రూమ్ మీరే కడుక్కుంటున్నారు. ఇది మా పని కదా!?'' అన్నాడు.

అతనితో సంభాషణంతా ఇంగ్లిష్‌లో సాగుతున్నది.

ఆ మాటలకు నవ్వి.. చెప్పడం మొదలుపెట్టాడు.

''కొందరు జీవితకాల పర్యంతం తమ మేథకు సంబంధించిన శ్రమలే చేస్తారు. కొంతమంది శారీరక శ్రమ చేస్తారు. వీటిలో చిట్టచివరి శ్రమ మురికిని శుభ్రం చేసే శ్రమ. ఇంకా దారుణమైన శ్రమ.. టాయిలెట్లు కడగడం. అయితే మా దేశంలో డ్రై టాయిలెట్లు కడగడం అనే ప్రక్రియ అత్యంత హేయం, నీచమైనది. ఈ నేపథ్యంలో నుంచి వచ్చిన నేను నా టాయిలెట్ కడుక్కుంటున్నాను. మాది స్కావెంజర్ కమ్యూనిటీ'' అన్నాడు.

''నేను ఇక్కడి యూనివర్సిటీలో చదువుతున్నాను. ఇది పార్ట్‌టైమ్ జాబ్. ఈ దేశంలో నా రంగు చూసే ఈ టాయిలెట్ కడిగే పని నాకు అప్పజెప్పారు. ఆఫ్రికా నుంచి బలవంతంగా ఓడల్లో బానిసలుగా తెచ్చిన గత